www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 8 జులై 2025

వినూత్నంగా మెగా పేరెంట్స్ మీటింగ్ ఆహ్వాన పత్రికలు

ఆహ్వాన పత్రికలను చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మెగా పేరెంట్స్ మీటింగ్ ఆహ్వాన పత్రికలను వినూత్నంగా తయారు చేసి అందరి మన్ననలు పొందారని ఉపాధ్యాయుడు రమణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సన్నాహక కార్యక్రమాలలో భాగంగా ఆహ్వాన కమిటీలోని ఉపాధ్యాయ, విద్యార్థుల బృందం కలర్ పేపర్స్, స్ట్రాలు ఉపయోగించి ఒక ప్రత్యేక నమూనా లాగా ఆహ్వాన పత్రికలు తయారు చేశారు. ఇలాంటి వినూత్న ఆలోచనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెరుగుతాయని పేర్కొన్నారు.

'మహతి' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కళాశాల గుర్తింపును రద్దు చేయాలి
- సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఫీజు వేధింపులకు పాల్పడుతున్న మహతి ఫార్మసి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ మహతి కళాశాల యాజమాన్యం ఫీజులు పేరుతో విద్యార్థులను వేధించడం, కళాశాల ఫీజు, ల్యాబ్, వార్షికోత్సవ దినోత్సవం, ఫేర్వెల్ పేర్లతో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ. 2 వేలు వసూలు చేస్తూ ఆ డబ్బుతోనే ఫంక్షన్లు చేయడమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు, యుజిసికి పూర్తి వ్యతిరేకంగా యాజమాన్యం కళాశాలను నడుపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజులు దశలవారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికీ యాజమాన్యం మాత్రం ప్రభుత్వమిచ్చే ఫీజు రీయింబర్స్మెంట్‌కు, కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని, విద్యార్థులే ఫీజు కట్టాలని ఒత్తిడి తేవడం దారుణమన్నారు. పైగా తరగతి గదుల్లోనే నిలబెట్టి ఫొటోలు తీయడం, పరీక్షల సమయంలో అనుమతించకుండా గంటల సమయాన్ని వృథా చేయిస్తున్నారన్నారు. మహతి కళాశాల యాజమాన్యం వేధింపులతో విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురై చదువుకే స్వస్తి చెప్పడం, ఆత్మహత్యలకు పాల్పడడం, ఇళ్ల నుంచి పారిపోవడం లాంటి వాటిని ఎంచుకుని భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారన్నారు. ఆ కళాశాల యాజమాన్యం ధనబలం, రాజకీయ బలంతో ఏమైనా చేయగలమనే దురుద్దేశంతోనే విద్యార్థులను పలు రకాల ఫీజులతో వేధిస్తున్నారన్నారు. మహతి కళాశాల యాజమాని న్యాయవృత్తిలో ఉంటూ చట్టం మన చేతుల్లోనే ఉంది కదా అనే పద్ధతితోనే, ఉద్దేశపూర్వకంగానే విద్యార్థులను వేధిస్తూ వారు ఆత్మహత్య చేసుకునే అంత ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు దండుకోవడంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో ఒక్క శాతం కూడా యాజమాన్యానికి లేదని, దీన్ని బట్టి చూస్తే ఎంతకి దిగజారిందో అర్థం చేసుకోవచ్చునని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మహతి ఫార్మసి కళాశాల యాజమాన్యంతో పాటు మిగిలిన కళాశాల యాజమాన్యాలతో మాట్లాడి, విద్యార్థులను ఫీజుల పేరుతో వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తామన్నారు. ధర్నా కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, నాని, సుల్తాను, బన్నీ పాల్గొన్నారు.

దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు

- పది మంది ముఠా సభ్యులు అరెస్టు
- రూ.3,66,500 విలువైన నోట్లు, ముద్రణ పరికరాలు, ల్యాప్‌టాప్, 12 సెల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పి విద్యాసాగర్ నాయుడు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కొంత కాలం నుంచి దొంగనోట్లు భారీగా ముద్రిస్తూ చెలామణి చేస్తున్న 10 మంది దొంగ నోట్ల ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పి విద్యాసాగర్ నాయుడు సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.366500 విలువైన దొంగనోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు దొంగ నోట్ల తయారీకి ఉపయోగించే సాంకేతిక పరికరాలు, యంత్ర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాల్మీకిపురం కేంద్రంగా దొంగనోట్ల ముఠా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారని తెలిపారు. వాల్మీకిపురం ప్రాంతానికి చెందిన ఖాలేషా అనే వ్యక్తి లక్కీ బ్రాందీ షాపులో గత నెల 26న రూ.500 నోటుతో మద్యం కొనుగోలు చేశారని, గతంలో ఇలాగే రెండు సార్లు దొంగ నోట్లు రావడంతో లక్కీ బ్రాందీ షాపు మేనేజర్ వాల్మీకిపురం పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ జె.ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఈ దొంగల ముఠా చీకటి పడగానే పట్టణంలో రూ.500 దొంగ నోట్లను మార్చే పనిలో ఉండడంతో పసిగట్టిన పోలీసులు పక్కా సమాచారం ఆధారంగా బెంగళూరు ప్రధాన రహదారిలోని వాల్మీకిపురం క్రాస్ వద్ద పోలీసులను చూసిన నిందితులు పారిపోవడానికి ప్రయత్నించడంతో చుట్టుముట్టి అదుపులో తీసుకున్నారు. అతన్ని విచారించగా దొంగ నోట్ల చలామణి గుట్టు రట్టు అవడంతో ఈ మొత్తం ముఠా నెట్‌వర్క్‌ను ఛేదించారని పేర్కొన్నారు. నకిలీ కరెన్సీ రాకెట్‌ను నడిపించడంలో విభిన్న పాత్రలు పోషించిన 10 మందిని ఈ కేసులో అరెస్టు చేశారు. నకిలీ కరెన్సీ నోట్ల మూలాన్ని నిర్వహిస్తున్న కర్ణాటకకు చెందిన రాథోడ్, కుమార్, బాబు మదనపల్లిలో దొంగనోట్లను ముద్రించి చలామణి చేసేలా పథకం రచించారని గుర్తించామని పేర్కొన్నారు. నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించడం, ఏజెంట్ల ద్వారా చెలామణి చేయడంలో వీరిపాత్ర కీలకంగా ఉన్నట్లు వెల్లడించారు. మరో ముగ్గురు ముఠా సభ్యులు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఖాలేషా పరిచయం ద్వారా పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు, ప్రజలు నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన సూచనలు పాటిస్తూ దొంగ నోట్లను గుర్తించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసి అరెస్టు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాయచోటి డిఎస్పి ఎం.ఆర్.కృష్ణమోహన్, వాల్మీకిపురం సిఐ జె.ప్రసాద్ బాబు, ఎస్‌లను అభినందించారు. సిబ్బందికి నగదు వారికి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి (పరిపాలన) ఎం.వెంకటాద్రి, రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌తో కార్మికులకు తీరని నష్టం : సిఐటియు

రాయచోటి : పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న 4 లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీరనిష్టం వాటిల్లుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజులు అన్నారు. సోమవారం సిఐటియు రాష్ట్ర. పిలుపు మేరకు ఈనెల 9న సమ్మె ప్రచారంలో భాగంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రధాన ద్వారం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబరకొడ్స్ అమలైతే సంఘం పెట్టకునే, సమ్మె చేసే హక్కులు ఉండవన్నారు. యూనియన్ రిజిస్ట్రేషన్‌లు ఉండవని, జీతాలు చెల్లింపులలో నెలల తరబడి ఆలస్యం చేసినా ధర్నాలు, ఆందోళనలు చేయకూడదని తెలిపారు. సమ్మె చేస్తే వారం రోజుల వేతనం ఇవ్వకూడదని ఆంక్షలు ఉండడం దారుణం అన్నారు. అధికారులతో చర్చలు కూడా చేయరని తెలిపారు. ఏన్నో ఏళ్లుగా కార్మిక వర్గం సాధించుకున్న సమ్మె చట్టాలను కార్పొరేట్లకు క్రోని కెపటీలలిస్టులకు దోచిపెట్టడమే ధ్యేయంగా నరేంద్ర మోడీ పని చేస్తున్నారని ఆరోపించారు. సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ, అక్బర్, శంకరయ్య, రమేష్, విద్యుత్ రంగం రాష్ట్ర నాయకులు ఎ.వి. రమణ, సుబ్రహ్మణ్యం, రాజు, గ్రామ పంచాయతీ నాయకులు దేవరా యలు ఎ.వి.రమణ, మోహన్ హమాలీ నాయకులు మాధవయ్య పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మెకు అంగన్వాడీలు మద్దతు తెలియజేస్తున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, రైల్వేకోడూరు ప్రాజెక్టు అధ్యక్షులు శ్రీరమాదేవి అన్నారు. స్థానిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్వాడీల సమస్యలపై టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు సమ్మెలో పాల్గొని ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు టిహెచ్ఆర్ పిల్లల తల్లులకు ఫేస్ అప్ పెట్టారు అది రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు యాప్‌లు కలిపి ఒకే యాప్ చేయాలని తెలిపారు. టీచర్, ఆయాకు ఫేస్ యాప్ రద్దు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, కోశాధికారి పద్మావతి, పద్మ అంగన్వాడీ వర్కర్లు ఆయాలు మినీ వర్కర్లు పాల్గొన్నారు. **చిట్వేలి:** మండలంలోని విఆర్‌ఎల సంఘం నాయకులతో కలిసి 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు పందికాళ్ళ మణి, విఆర్ఎ సంఘం డివిజన్ అధ్యక్షులు కొరముట్ల సుధాకర్ పిలుపునిచ్చారు.స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమ్మె నోటీసు ఇచారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు సుబ్బరాయుడు, శీను, చంద్ర, రమణ, సరస్వతి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి సమస్యలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అత్యంత ప్రాధాన్యతతో జవాబుదారితనంతో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై సిఎంఒ కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించిన పరిష్కారంతోపాటు ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్‌ను కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఈ విషయాన్ని గుర్తెరిగి అధికారులందరూ ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని పేర్కొన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐక్యతను ప్రదర్శిస్తున్న మదనపల్లె ప్రజా సంఘాల నాయకులు

బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై

ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మండలంలోని అంకిశెట్టిపల్లి గ్రామం, బుద్ధుని కొండపై వెలసిన తథాగతుడు గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని మదనపల్లెలోని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిందితులను వదిలేసి, బాధితులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించిన ఎస్పి విద్యాసాగర్ నాయుడుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం ప్రజాసంఘాల నాయకులు స్థానిక ఎస్టియు భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బహుజన సేన అధ్యక్షులు శ్రీచందు అధ్యక్షత వహించగా మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలాసుదర్శనం, బిఎస్పి జిల్లా అధ్యక్షుడు మిద్దేపల్లి బాలాజీ, సిఐటియు జిల్లా కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ నాయకులు పిఎల్ నరసింహులు, తోపు కృష్ణప్ప, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనేటి దివాకర్, బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులుబోడెం రాజశేఖర్, బాస్ రాష్ట్ర నాయకుడు కె.వి. రమణ, విహెచ్‌పిఎస్ నాయకుడు నల్లబోతుల సుదర్శన్ బాబు, కురబసంఘ నాయకుడు జి.వి.శివకుమార్, చేనేత సంఘ నాయకుడు నాగరాజు, మైనార్టీ నాయకులు నూర్ అలాం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధునికొండలో నిలువెత్తు పీఠంపై నుండి భగవాన్ బుద్ధుని విగ్రహాన్ని కిందకు తోసేసి, ధ్వంసం చేసి, తంగళాన్ సినిమాలో లాగా తల నరికి, విగ్రహం చేతిలో ఉంచి అమానుషంగా ప్రవర్తించారన్నారు. ఈ దుర్ఘటనపై స్థానిక పోలీసు స్పందన నిర్లక్ష్యంగా ఉండడాన్ని బట్టి చూస్తే మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ నిందితులకు అమ్ముడుపోయి, కేసును తప్పుదోవ పట్టించి, కేసును నీరుగార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. బుద్ధ విహార నిర్వాహకుల వద్ద పిర్యాదు తీసుకోకుండా, వారిని విచారించకుండా, విఆర్ఒను పిలిపించుకొని, సిఐ ఇష్ట ప్రకారం నామ మాత్రపు కేసు నమోదు చేశారన్నారు. బుద్ధ విహార నిర్వాహకులు అనుమానితుల పేర్లు వెల్లడించినా సిఐ పట్టించుకోలేదని తెలిపారు. సిఐ ఈ కేసుకు విచారణ అధికారిగా ఉంటే, కచ్చితంగా అసలు నిందితుల్ని తప్పించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బి.కొత్తకోట : బుద్ధుని తలనరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని బాస్ రాష్ట్ర అధ్యక్షులు గణపతి డిమాండ్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షతో బౌద్ధులను అవమానించడమే కాకుండా దురుసు ప్రవర్తనతో దళిత నేతల్ని గాయపరచి,బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన ఎస్పీపై తగు చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సచిన్, మండల అధ్యక్షులు పలక వెంకటేష్, తాలూకా ఉపాధ్యక్షులు మాధవ, సొట్ట గంగాద్రి, సురేష్, జయన్న పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎస్పి విద్యాసాగర్ నాయులు

ప్రజాశక్తి- రాయచోటి

ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని, తల్లి పేరుమీద ప్రతి విద్యార్థితో మొక్క నాటించడం ద్వారా తల్లిదండ్రుల పట్ల, పర్యావరణం పట్ల బాధ్యత పెంపొందుతాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై ఎస్పి విద్యాసాగర్‌రావు, డిఇఒ , డిఐఇఒ, ఎంఇఒలు, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాల ప్రిన్సిపాళ్లు, ఎంపిడిఒలు, రాజంపేట అడిషనల్ ఎస్పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డేలతో కలిసి కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో మెగా పేరెంట్స్ టీచర్ మీట్ నిర్వహించడం జరుగుతోందని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో ఈ కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా నుండి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలో దాదాపు రెండు లక్షల 50 వేల మంది విద్యార్థులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అందరూ కలిపి దాదాపుగా 6,75,000 మంది కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల తల్లిదండ్రులను పాఠశాలలతో సమన్వయం చేసి విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దడం కోసం వారి ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులతో చర్చించడం, విద్యా పురోగతి గురించి వివరిస్తూ, క్రీడలు, పాఠశాల అభివృద్ధి పై తల్లిదండ్రులకు వివరించి వారితో చర్చించి సలహాలు సూచనలు తీసుకొని వారి అభివృద్ధికి తోడ్పడటమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగానే ఏక్ పేడ్ - మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం కింద మొక్కను నాటేందుకు ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్పోర్ట్ ఇస్తారన్నారు. తల్లి పాదాలకు వందనం చేసి మొక్కను నాటదాంతో పాటు దానిని సంరక్షించి అది మాను అయ్యేవరకు కాపాడాలన్నారు. ఇందుకు సంబంధించి లీప్ యాప్‌లో వివరాలను అప్లోడ్ చేయాలని, కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ కూడా చేస్తున్నామని, ఇందుకోసం 30 సెకండ్ల వీడియోక్లిప్, మూడుఫొటోలు అప్‌లోడ్ చేసేలా డాక్యుమెంట్ చేసి, రాష్ట్రవ్యాప్తంగా 2.3 కోట్ల మంది ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో కార్యక్రమంలో పాల్గొనేలా విద్యాశాఖ ప్రణాళిక రచించిందన్నారు. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు కళాశాలలకు అవసరమైన మొక్కలు ఈనెల 9లోగా సరఫరా చేయాల్సిందిగా డ్వామా పీడీ, సంబంధిత ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. ఎంపిడిఒ ఆధ్వర్యంలో స్కూల్‌కు కావలసిన మొక్కలను సరఫరా చేయాలని, ఈ పనిని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎస్పి విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పోలీస్ శాఖ వారు సే నో టు డ్రగ్స్, సైబర్ క్రైమ్స్, ఆడపిల్లలు, మహిళలను ఏ విధమైన వేధింపులకు గురిచేసే పరిణామాలు, తదితర అంశాలపై పాటించాల్సిన మెలకువలు గురించి ఎస్‌హెచ్ఒలు అవగాహన కల్పిస్తారన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో ఉన్నటువంటి పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య రాకుండా సిబ్బందిని కేటాయించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజు మామిడి రైతులను పట్టించుకోని జగన్ ఈ నెల 9న మామిడి రైతులను ఏం చేయాలని చిత్తూరు జిల్లా బంగారుపాళెంకు వస్తున్నావని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండిపల్లి భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి రైతులను పరామర్శించడానికి వస్తుంటే వేలాది మంది కార్యకర్తలు, 1810 వ్యాన్లు, 2230 బైకులు అవసరమా జగన్ అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత తప్పుడు రాజకీయాలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుడుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క రైతులను కాపాడుకోవాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పోలవరాన్ని ముందుకు తీసుకొని వెళ్లుతూ చకచక పనులు సాగిస్తూ వచ్చే 2 సంవత్సరాల్లో పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారన్నారు. హంద్రీ-నీవాకు రూ.3500 కోట్లు కేటా యించి కుప్పం వరకు నీటిని తీసుకొని పోతామని తెలిపారు. గతంలో వరదలు వస్తే నీటిలో దిగని జగన్ ప్రభుత్వంపై నల్లగుడ్డ వేస్తున్నారన్నారు. వైసిపి కార్యకర్తను తన కారు కింద తొక్కించి చంపిన జగన్ బంగారుపాలెంలో ఎంత మంది మామిడి రైతులను తొక్కి స్తావోనని తులుచుకుంటే భయం వేస్తుందన్నారు. గుంటూరు మిర్చియార్డులో పరామర్శకు వెళ్లినప్పుడు నీ దొంగలు మిర్చి మూటలను ఎత్తుకెళ్లలేదా అని ప్రశ్నించారు. దర్శి పొదిలి లో పొగాకు రైతులను పరామర్శించడానికి వెళ్లి పొగాకు బేళ్ల తొక్కి నాశనం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బంగారుపాళెంలో మామిడి రైతులను ఏం చేద్దామని ఈ పర్యటన జగన్ అని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలకు పల్ప్ ఫ్యాక్టరీలు ఉన్నవి నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, టిడిపి నాయకులు గౌడ్, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్ : జిఒ 36 అమలు కోసం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు 18వ రోజు సోమవారం కొనసాగాయి. కార్మి కులు మున్సిపల్ ఆఫీస్ ఎదుట మానవహారంగా ఏర్పడడంతో పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్య దర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసా గించాలని, లేనిచో పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుచేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పని ముట్లు సరఫరా చేయాలని పేర్కొన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపో వడాన్ని కార్మికుల్ని దగా చేయడం కాదా అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆప్కాస్ కొనసాగించి ప్రయివేట్ ఏజెన్సీ లకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం తగు చర్యలు చేపట్టాలంటూ కోరారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, విద్యుత్ రంగం నాయకులు రమణ, మణి మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యల సాధన పోరాటానికి అండగా ఉంటా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు చెన్నయ్య, రాంబాబు, దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ పాల్గొన్నారు.

స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : అర్హులందరికీ ఇళ్ల పట్టాలతోపాటు పక్కా గృహాలు మంజూరు చేసే అంశంలో సకాలంలో స్పందించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉదయ్ కిరణ్, జిల్లా కార్యదర్శి మావులూరు విశ్వనాథ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలు పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. హామీల అమలుపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల పార్టీల నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు వందల సంఖ్యలో అద్దె గృహాల్లో జీవిస్తున్నారన్నారు. పట్టణంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరోమారు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితులతో కలసి తహశీల్దార్ నరసింహ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రమణ, రఘునాథ్ నాయుడు సుజాత, లవకుమార్, ఆంజనేయులు, పెద్దన్న సుబ్బమ్మ, మాణిక్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

సాహితీరత్న అవార్డు తీసుకుంటున్న మునిగోటి శ్రీనివాసశర్మ

'మునిగోటి'కి సాహితీరత్న పురస్కారం

ప్రజాశక్తి-మదనపల్లె

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, విజయవాడ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లెకు చెందిన ప్రముఖ సాహితీవేత్త మునిగోటి శ్రీనివాసశర్మను సాహితీ రత్న పురస్కారంతో సత్కరించారు. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. పురస్కారం అందుకున్న అనంతరం శ్రీనివాస శర్మ మాట్లాడుతూ ఇది నాకు కలిగిన గౌరవమే కాక, భవిష్యత్తులో మరింత ఉత్తమ రచనలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పాడి పరిశ్రమతోనే రైతుల అభివృద్ధి

ప్రజాశక్తి-కలికిరి

పాడి పరిశ్రమతోనే రైతులు అభివృద్ధి చెందవచ్చునని పశు వైద్యాధికారి వెంకటమ్మని నాయుడు రైతులకు సూచించారు. సోమవారం గుండ్లూరు రైతు సేవాకేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి వెంకటముని నాయుడు మాట్లాడుతూ వివిధ పశుగ్రాస జాతుల విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమం ప్రతి ఏటా జులై 7 నుండి 14 వరకు అన్ని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. పాడి రైతులు పచ్చిమేత, ఎండు గడ్డి తగు పాళ్లలో వాడుకుంటే లాభాల బాట పట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్క పాడిరైతు గడ్డి కత్తిరించే యంత్రాన్ని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహల్, మేడికుర్తి, పాలెం పశువైద్యాధికారులు డాక్టర్ గిరినాథ్‌రెడ్డి, డాక్టర్ కీర్తి, డాక్టర్ గన్ మోహన్‌రెడ్డి, సిబ్బంది చంద్రబాబు, వంశీ, రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీ గొల్లపల్లి దళితవాడలో నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి మండల ఎంపిపి ముద్దబాబుల్‌రెడ్డి రూ.50 వేలు విరాళంగా సోమవారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముద్దా బాబుల్‌రెడ్డి దేవాలయాల నిర్మాణ కోసం ప్రదర్శిస్తున్న దాతృత్వాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఎల్లమ్మ ఆశీస్సులు ఎంపిపి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గ్రామ ప్రజలు ఎల్లయ్య, వెంకటసుబ్బయ్య, పెద్దన్న పాల్గొన్నారు.

బాధితుడితో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, మహిళా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతీస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలివాలని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ అతావుల్లా అన్నారు. సోమవారం పట్టణం లోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన ఓ గర్భిణీ డెలివరీ కోసం ప్రభుత్వా సుపత్రికి చేరారు. డాక్టర్ బి పాజిటివ్ రక్తం అవసరమని తెలపడంతో వెంటనే బంధువులు అతావుల్లాను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన ఇవా బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మాన మహమ్మద్‌అలీ సహకారంతో ఆర్గనైజేషన్ సభ్యులు నాజిముల్లా అనే యువకుడి చేత దీప బ్లడ్ బ్యాంక్‌లో బి పాజిటివ్ రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం అనేది ప్రాణానికి చాలా అవసరమని రక్తదానం చేయడం ద్వారా ప్రాణాన్ని కాపాడే వ్యక్తులమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న నాజీముల్లా

పబ్లిక్ నోటీస్

అన్నమయ్య జిల్లా రాజంపేట టౌన్ ఈడిగపాళెంలో యుండు కీ:శే: దాసరి వెంకటాచలపతి గారి కుమారుడు దాసరి రమేష్ గౌడ్ (రమేష్ బాబు) యావన్మందికి తెలియజేయడమేమనగా లోగడ నాతల్లి గారైన దాసరి వెంకట సుబ్బమ్మ తన వారసులు అందరికీ తనకు సంబంధించిన ఆస్తులను రిజిస్టర్ వీలునామా బుక్ నెంబర్ 3 డాక్యుమెంట్ నెంబర్ 21/2004, 18.10.2004 తేదీన రాసి 22.12.2007న స్వర్గస్తులైనారు. నాకు పై కనపర్చిన వీలునామాలోని ఈ షెడ్యూల్ ద్వారా క్రింద కనపర్చిన ఆస్తి సంక్రమించినది. సదరు ఆస్తిని రాజంపేట K.V.B. బ్యాంకు నందు లోను తీసుకుంటున్నాను. షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్న ఈ నోటీసు ప్రకటించిన దినం నుండి వారం రోజుల లోగా బ్యాంకులో వారికి తెలుపగలరు.

షెడ్యూల్

కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ రిజిస్ట్రార్, రాజంపేట మున్సిపాలిటీ ఈడిగపాలెం వీధిలోని పాత డోర్ నెంబర్ 1/206, కొత్త డోర్ నెంబర్ 1/ 266 లాదు మరియు ఆర్ సీసీ మిద్దె ఇల్లు చెక్కుబంది:
తూర్పు: షేక్ అలీ, పడమర: పంచాయతీ రోడ్డు ఉత్తరం: దాసరి శ్రీరాములు గౌడ్ గారి ఇల్లు, దక్షిణం: దాసరి కళాధర్ బాబు గారి ఇల్లు, తూర్పు- పడమర: 67 అడుగులు (20 మీటర్లు) ఉత్తరం-దక్షిణం: 30 అడుగులు (9 మీటర్లు) ఈ కొలతలలో కట్టబడిన లాదు మరియు ఆర్‌సీసీ మిద్దె ఇల్లు మాత్రమే.

దాసరి రమేష్ గౌడ్,
రాజంపేట

బాబు మోసాలను ఎండగడదాం : 'ఆకేపాటి'

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం నిర్వహించాలని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేష్ బాబు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, కడప పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేటు పంక్షన్ హాలులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇటీవలే కాలంలో మృతి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, గుంటిమడుగు సుధాకర్‌రాజు, వల్లెపు రాజా, బత్తిన శశికుమార్‌రెడ్డి చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్‌ను రిలీజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ మేనిఫెస్టో కార్యక్రమం ఇంటింటికి చేపట్టాలని ప్రతి ఒక్కరూ ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఈ కూటమి ప్రభుత్వంలో మీ కుటుంబానికి ఎంత మోసం జరిగిందో గ్రామ స్థాయిలో ఉన్న ప్రజలు ఇంటి వద్దకు వెళ్లి తెలియజేయాలని సూచించారు. ప్రతి వైసిపి కార్యకర్తకు అండగా ఉంటామని, రాబోయే కాలం మనదేనన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు వై.శివారెడ్డి,అన్నపూర్ణ, శ్రీ వర్ధన్‌రెడ్డి, సిహెచ్ రమేష్, మండల నాగేంద్ర, ఐదు మండలాల కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, వార్డు మెంబర్లు, నియోజకవర్గ అనుబంధ విభాగల అధ్యక్షులు పాల్గొన్నారు.

అరవపల్లి క్రికెట్ లీగ్ విజేత చింతకాయలపల్లి

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అరవపల్లె క్రికెట్ లీగ్ సీజన్ వన్ విజేతగా చింతకాయలపల్లె జట్టు విజయం సాధించింది. సోమవారం ఉదయం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అరవపల్లికి చెందిన ఫాల్కన్ లెవెన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 14 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 76 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చింతకాయలపల్లి జట్టు 11.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 78 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టులోని ఆటగాళ్లు రూపేష్ 3 వికెట్లను తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రతి మ్యాచ్‌లో ప్రతిభ కనపరిచిన ఈరి శివ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకు న్నాడు. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి ఫైనల్ విజేత చింతకాయలపల్లె జట్టుకు రూ.30 వేలు, ట్రోఫీ అందజేశారు. జనాబ్ ఎస్టీఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కలీముల్లా ఖాన్, షమీ ఉల్లాఖాన్ రూ.30 వేలను, విజేత ట్రోఫీని గుణ యాదవ్ అందజేశారు. రన్నర్స్‌కి ఒరాకిల్ సాఫ్ట్వేర్ బృందం రూ.20 వేలు అందజేయగా, రన్నర్స్ ట్రోఫీని యంబలూరు ప్రదీప్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామరాజ్, టిడిపి నాయకులు రెమో సురేష్, బిజెపి నాయకులు నాయకులు జయకుమార్ రెడ్డి, మురళి, ఎసిఎల్ కమిటీ సభ్యులు బుల్లెట్ హరి, అరుణ్, మల్లెం రాము పాల్గొన్నారు.

విజేత ట్రోఫీని అందుకుంటున్న చింతకాయలపల్లె జట్టు

'కష్టపడిన వారికి సముచిత స్థానం'

నిమ్మనపల్లె : మాట్లాడుతున్న పరిశీలకులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సంస్థాగత ఎన్నికల కమిటీలలో సముచిత స్థానం కల్పిస్తామని మదనపల్లె సంస్థాగత ఎన్నికల పరిశీలకులు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 30వ వార్డులో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమానికి మల్లికార్జునరెడ్డితోపాటు పార్టీ సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి, బొమ్మిశెట్టి పురుషోత్తం, ముసలికుంట నాగయ్య, మార్పూరి నాగార్జున బాబు హాజరయ్యారు. స్థానిక నాయకులు దుబ్బిగాళ్ల భాస్కర్, ప్రవీణ్ రాయల్, మస్తాన్‌లి వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనకు పెద్ద బాధ్యతలను అప్పగించిందన్నారు. సంస్థాగత ఎన్నికలకు తనను పరిశీలకులుగా నియమించిందని, పట్టణంలోని అన్ని వార్డులపైన తనకు సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సీనియర్ నాయకుల సహకారంతో కమిటీల ఎంపిక పారదర్శకంగా చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తొలిప్రాధాన్యత ఉంటుందని, ఎటువంటి సందేహం లేదని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి అటువంటి వారికి బాధ్యతలు అప్పగించాలని అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శైలజ, అంబికా శ్రీ, జయచంద్ర నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, గౌస్ అజాం, రామిశెట్టి రెడ్డి కేశవ, నాదెండ్ల అరుణ్ తేజ, సాయి, తౌఫిక్, గగన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టిడిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకులు కుడుము శ్రీనివాసులు అన్నారు. రాజంపేట టిడిపి అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరత్నం, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్ రావు, మల్లికార్జున, మల్లప్పలతో కలిసి సోమవారం మండలంలోని అన్ని పంచాయతీలలో సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. టిడిపి బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా ఉంటూ ఏకగ్రీవంగా కమిటీ నాయకులను ఎన్నుకొని, భవిష్యత్తులో పార్టీని విజయ తీరాల వైపు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు నాయకులకు ముందుగా సూచించారు. అనంతరం బూత్ స్థాయి, గ్రామస్థాయి సంస్థాగత ఎన్నికలకు కమిటీ సభ్యులపై నాయకులు కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరించగా, రాచవేటివారిపల్లె, వెంగంవారిపల్లె పంచాయతీలలో మాత్రమే కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన పంచాయితీలు రెడ్డివారిపల్లె, ముష్టూరు, కొండయ్యగారిపల్లె, నిమ్మనపల్లి, తవళంలో ఎక్కడా కూడా కార్యకర్తల నుంచి ఏకాభిప్రాయం రాలేదు. సామకోటవారిపల్లె, అగ్రహారం, బండ్లపై గ్రామాలలో మరో తేదీకి వాయిదా పడింది. గ్రామస్థాయి అధ్యక్షుని ఎన్నుకోవడంలో నాయకుల మధ్య సయోధ్య కుదరలేదు. గ్రామస్థాయిలో అధ్యక్ష పదవులకు నువ్వానేనా అంటూ ఒకరిని మించి మరొకరు పోటీ పడ్డారు. ఎన్నికల పరిశీలకులు శ్రీనివాసులు ఎన్నికల్లో పోటీపడిన వారి వివరాలను సేకరించి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోతామని, అనంతరం పార్టీ క్షేత్రస్థాయి నుంచి అభ్యర్థులపై సమగ్ర సమాచారాన్ని సేకరించి నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన'

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పాలన సాగుతోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం ఏడాది కాలంలోనే ముఖ్యమంత్రి ఎవరు కనివిని ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో పరుగులు పెట్టించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ఆంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందని ఇందుకు మనమందరం ప్రభుత్వానికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే బాధితుల సమస్యలు పరిష్కరించారు. అర్జీదారులు మంత్రివర్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌సిసి కోసం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో ఎన్‌సిసి శిక్షణ కొరకు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో చిత్తూరు ఎన్‌సిసి యూనిట్ సుబేదార్ మహేష్, హవల్దార్ సందీప్, సిటిఒ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎన్‌సిసి శిక్షణ కొరకు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఎన్‌సిసి శిక్షణకు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసామన్నారు. త్వరలోనే ఎన్‌సిసి అధికారులు, సిటిఒ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు ఎన్‌సిసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎన్‌సిసి శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ అలబడుతుందని, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు భవిష్యత్తులో పోటీ పరీక్షలలో ఈ శిక్షణ విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు పూర్తిస్థాయిలో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి యూనిట్ సుబేదార్ మహేష్, హవల్దార్ సందీప్, సి.టి.ఓ వెంకట గోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

మండలం వరిగ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. రాయచోటి మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్, మాజీ సర్పంచ్ కుమారుడు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యే వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు దూరంగా ఉన్న విద్యార్థులకు పుస్తకాలు కొంత మేర ఉపయుక్తంగా ఉంటాయని ఆశిస్తున్నాను అన్నారు. చదువు కోసం ఎన్ని కష్టాలొచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగాలని ప్రతి విద్యార్థి సంకల్పించాలని చెప్పారు. పాఠశాల సిబ్బంది ఈ సేవా కార్యక్రమాన్ని హర్షిస్తూ నరసింహారెడ్డిని శాలువాతో సన్మానించారు. విద్యార్థులకు సహాయం చక్కటి మార్గనిర్దేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైసిపి నాయకులు విశ్వనాథ్ రెడ్డి, రామాంజులురెడ్డి, బూత్ కన్వీనర్ సుబ్బారెడ్డి, వైసిపి పట్టణ ఉపాధ్యక్షుడు మోతుకూరి నాగేంద్ర, నాయకులు అరుణ్ కుమార్‌రెడ్డి, శివాంజనేయులు, ప్రసాద్, జయచంద్ర, శ్రీను, చంద్రమోహన్ రెడ్డి, ధన, చంద్రాయుడు, సీతారామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఝరికోన మడుగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- కలకడ

ఉస్మాన్ (ఫైల్ ఫొటో)

ఝరికోన మడుగులో గల్లం తైన యువకుడి మృతదేహం వెలికి తీసినట్లు సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. మండలంలోని బాలయ్య గారిపల్లి పంచాయతీ ఝరికోనలో గల్లంతైనా యువకుడి మృతదేహాన్ని అతి కష్టం మీద వెలికి తీసినట్టు తెలిపారు. రాయచోటికి చెందిన ఉస్మాన్, శెట్టిపల్లికి చెందిన తన స్నేహితులతో కలిసి ఆదివారం ఝరికోనకు ఈత ఆడడానికి స్నేహితులతో కలిసి వెళ్లి గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. మిగిలిన ఏడుగురు యువకులు బయటకొచ్చి సంబేపల్లి పోలీసులకు సమాచారం అందించినట్టు తెలిపారు. ఎస్ఐ ఆదేశాల మేరకు సంబేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి వరకు గాలించినా మృతదేహం లభించలేదు. కాగా సోమవారం పోలీస్, ఫైర్ నీటిలో గాలించి వెలికి తీసినట్టు తెలిపారు. అనంతరం మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు మృతిని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న నాయకులు

కష్టపడిన వారిని పార్టీ గుర్తిస్తుంది : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

పార్టీ కోసం పనిచేసే నాయకులను అధిష్టానం గుర్తిస్తుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా చింతపర్తి సహదేవయ్య, మండల క్రిస్టియన్ విభాగ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, పీలేరు నియోజకవర్గం క్రిస్టియన్ అధ్యక్షుడిగా జూపల్లి రామ చంద్రయ్యను చింతల కమిటీ సభ్యులుగా ప్రకటించారు. అనంతరం కమిటీ సభ్యులు సహదేవయ్య, రామచంద్ర, కృష్ణమూర్తి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైసిపి తరపున అందరికీ అండగా ఉంటానని తెలిపారు. మీరందరూ కలికిరి మండలంలో కలిసికట్టుగా వైసిపికి కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమములో మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎస్సీ సెల్ కార్య దర్శి వి.హరి, మహేందర్‌రెడ్డి, ఈశ్వర్ గౌడ్, మచ్చ సాదేవయ్య, రామకృష్ణ, శ్యాముల్, గిరి, హరి, కృష్ణయ్య బాబు, గురు, రహిమాన్, నాగరాజా పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న నిస్సార్ అహమ్మద్

సమస్య పరిష్కారానికి అధికారమే అవసరం లేదు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సమస్యను పరిష్కరించాలంటే అధికారమే ఉండాల్సిన అవసరం లేదని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ స్పష్టం చేశారు. మదనపల్లె మండలం, పోతబోలు పంచాయతీ మల్లయ్యదేవరపల్లిలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించిన నిస్సార్ అహమ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మల్లయ్యదేవరపల్లిలో రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్ రెడ్డి నిధులతో నూతనంగా బోరు బావి తవ్వకానికి నిస్సార్ అహమ్మద్ చేతులమీదుగా భూమి పూజా చేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ మల్లయ్యదేవరపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పైన గ్రామస్థులు తనను సంప్రదించారన్నారు. సమస్యను ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన బోరు బావిత్రవ్వకానికి తన నిధులు మంజూరు చేశారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో సమస్యల పరిష్కారించేందుకు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో అధికంగా ఉన్న నీటి సమస్య విషయాన్ని నిస్సార్ అహమ్మద్ దృష్టికి తీసుకు వెళ్ళిన వెంటనే స్పందించి, బోరు బావి తవ్వకానికి ఎంపీ నిధులు మంజూరు చేయించడం సంతోషంగా ఉందన్నారు. ఎంపి మిధున్ రెడ్డి, మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోతబోలు సర్పంచ్ ఈశ్వరయ్య, రేవంత్, ఎంపిటిసి వెంకటేష్, మాజీ ఎంపిటిసి రత్నమయ్య, లక్ష్మన్న, ఈశ్వర్ నాయక్, హరి నాయక్, నర్సింహులు, మల్లికార్జున, శంకర్ నాయక్, నాగరాజు, మల్లయ్యదేవరపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిందితురాలి అరెస్టు చూపుతున్న పోలీసులు

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: భర్త హత్య కేసులో నిందితురాలైన భార్యను తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి మహేంద్ర, సిఐ కళా వెంకట్రమణ నిందితురాలిని అరెస్టు చూపించారు. అరెస్టుకు సంబంధించిన వివరాలు డిఎస్‌పి తెలియజేశారు. మదనపల్లె మండలం, కొత్తవారిపల్లి పంచాయతీ, రెడ్డిగానిపల్లెకు చెందిన వంకోల్ల చంద్రశేఖర్(46) మద్యానికి అలవాటు పడి ఇంటిని పట్టించుకోకుండా జులాయిగా తిరిగేవాడు. దీంతో భార్య రమాదేవి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరి పిల్లల్ని పోషించుకుంటూ జీవనం చేసేది. ఈ క్రమంలో మరో వ్యక్తితో చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకుంది. కాగా మద్యం తాగి వచ్చిన భర్తతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఈ నెల 2న తల్లికి వందనం డబ్బులను తీసుకున్న చంద్రశేఖర్ ఇంట్లో ఇవ్వకుండా తప్పతాగి వచ్చాడు. భార్యతో గొడవపడి తిరిగి మద్యం తాగేందుకు భార్యను నీళ్ల ఇవ్వమన్నాడు. ఇదే అదునుగా భావించిన రమాదేవి విషపూరితమైన నీళ్లను భర్తకు ఇచ్చింది. అతను మత్తులోకి జారుకున్న వెంటనే గొంతు నులిమి హత్య చేసింది. ఆ తర్వాత ఎవరికి అనుమానం రాకుండా మద్యం తాగి చనిపోయినట్లు నటించింది. అన్న అంత్యక్రియలకు హాజరైన మహేష్‌కు వదినపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భర్తను తానే హత్య చేసినట్లు రమాదేవి ఒప్పుకోవడంతో అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

వాటర్ ట్యాంక్ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

వాటర్ ట్యాంకర్ బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. రెడ్డీస్ కాలనీకి చెందిన హుస్సేన్ మినరల్ వాటర్ ట్యాంకర్‌తో పట్టణంలోని ఇళ్లవద్దకు వెళ్లి సరఫరా చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రెడ్డీస్ కాలనీలో వాటర్ ట్యాంకర్‌తో వెళ్తుండగా అనుకోకుండా రోడ్డుపై గుంతలో చక్రం దిగడంతో అదుపు తప్పి ట్యాంకర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ హుసేన్‌ను 108 సిబ్బంది దివ్య, సర్దార్ స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

అనుమానాస్పద స్థితిలో భవన కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కురబలకోట మండలంలో వెలుగు చూసింది. ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు.. సిద్ధారెడ్డిగారి పల్లి చెందిన శివశంకర్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. ఇతనికి మద్యంఅలవాటు ఉంది. ఆదివారం కూలీపనులు ముగించుకుని రాత్రి ఫుల్లుగా మద్యం తాగి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో కిందపడి తేరుకుని లేచి ఎలాగో ఇంటికి చేరుకున్నాడు. నిద్రపోయిన శివ శంకర్ ఉదయం లేవలేదు. భార్య భాగ్యమ్మ ఇరుగుపొరుగు వారికి పిలిచింది. అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కుమారుడు తేజ్ కుమార్ ఉన్నారు.